సాక్షి
విజయనగరం

శుక్రవారం, 3, మే, 2024



వైద్య రంగంలో... ఉద్యోగ విప్లవం - 8లో

వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులను జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చింది.



టీడీపీ విందు రాజకీయాలు

తెలుగుదేశం పార్టీ నాయకులు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా విందు భోజనాలకు దారులు తెరిచారు. - 8లో



కరపత్రాల్లేకుండా ఏం అవగాహన..? - 8లో

వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించడంలో నిర్లక్ష్యం చూపిన వైద్యులపై వైద్యారోగ్య శాఖ కమిషనర్ వెంకటేష్ మండిపడ్డారు.

న్యూస్‌రీల్

అభ్యర్థుల ఖర్చుల పరిశీలన



ఖర్చులు పరిశీలిస్తున్న అబ్జర్వర్లు

విజయనగరం అర్బన్: ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఎన్నిక ఖర్చును జిల్లా వ్యయ పరిశీలకుడు ప్రభాకర్ ప్రకాష్ రంజన్, ఆనంద్‌కుమార్, ఆకాష్ దీప్ గురువారం పరిశీలించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మొదటి విడత ఖర్చుల పరిశీలనా కార్యక్రమం జిల్లా వ్యయ నోడల్ అధికారి డాక్టర్ సత్యప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. వివిధ నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, వారి ప్రతినిధులు తమ ఖర్చుల వివరాలను రెండో విడత ఈ నెల 6న, మూడో విడత 10న నిర్వహిస్తారు. కార్యక్రమంలో నియోజకవర్గాల అసిస్టెంట్ ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్లు, పోటీ చేస్తున్న అభ్యర్థులు, వారి ప్రతినిధులు పాల్గొన్నారు.

వెలవెలబోయిన బాలకృష్ణ రోడ్‌షో



వెలవెలబోయిన బాలకృష్ణ రోడ్ షో

విజయనగరం రూరల్: విజయనగరంలో గురువారం రాత్రి స్వర్ణాంధ్ర సాకార యాత్ర పేరిట సినీ నటుడు బాలకృష్ణ నిర్వహించిన రోడ్‌షో జనం లేక వెలవెలబోయింది. జిల్లాకో మెడికల్ కళాశాల, ప్రపంచంలోనే తొలిసారిగా డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసిన ఘనత చంద్రబాబుదేనంటూ చేసిన ఉత్తిత్తి ప్రసంగం టీడీపీ కార్యకర్తల్లో విసుగు పుట్టించింది. టీడీపీ ఉనికిని కాపాడుకోవడానికి ఇదే ఆఖరిపోరాటంగా పేర్కొన్నారు. విజయనగరం టీడీపీ ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడును వాహనంపై నుంచి కిందకు దించేయడం ఆయన అనుచరుల్లో ఆగ్రహం తెప్పించింది. సభ జరుగుతున్నంత వరకు కలిశెట్టి కిందనే నిల్చోవాల్సి వచ్చింది.

కంట్రోల్ రూమ్ సందర్శన



సందర్శించిన ఎన్నికల పరిశీలకుడు చాబ్రా

విజయనగరం అర్బన్: కలెక్టరేట్‌లోని ఎన్నికల కంట్రోల్ రూమ్‌ను జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు హనష్ చాబ్రా గురువారం సందర్శించారు. వివిధ విభాగాల ఇన్‌చార్జిలతో మాట్లాడారు. ఎన్నికల విధులపై ఆరా తీశారు. మీడియా మోనటరింగ్ విభాగాన్ని సందర్శించి, ఎంసీఎంసీ అనుమతులు, పెయిడ్ న్యూస్, రాజకీయ ప్రకటనలపై సమీక్షించారు. జిల్లాలో ఇంత వరకు సీజ్ చేసిన వస్తువులు, మద్యం తదితర అంశాలపై నియోజకవర్గాల వారీగా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎస్.డి.అనిత, కంట్రోల్ రూమ్ ఇన్‌చార్జి పి.బాలాజీ, ఆయా విభాగాల ఇన్‌చార్జి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పైడితల్లి హుండీల ఆదాయం లెక్కింపు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి ఆలయ హుండీల ఆదాయాన్ని అమ్మవారి కళ్యాణ మండపం ఆవరణలో గురువారం లెక్కించారు. 34 రోజులకు చదురుగుడి హుండీల నుంచి రూ.13,14,277లు వచ్చినట్టు ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు తెలిపారు. కార్యక్రమంలో శ్రీవారి సేవా సంఘం ప్రతినిధులు, ధర్మవరం గ్రూప్ టెంపుల్స్ ఈఓ బి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

విజయనగరం: ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఈ నెల 15 నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. ఏపీ క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 50 శిబిరాలు నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్టు వెల్లడించారు. శిబిరాల్లో 8 నుంచి 14 సంవత్సరాలలోపు వయస్సు గల బాల, బాలికలు తమకు ఇష్టమైన క్రీడాంశంలో ఉచితంగా శిక్షణ పొందవచ్చని సూచించారు.

మీ భూమి.. మీ సొంతం



- వందేళ్ల తర్వాత ఊరూరా భూముల రీసర్వే
- 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు మరియు భూరక్ష' పథకం కింద భూములకు సర్వహక్కులు
- ఇప్పటికే జిల్లాలో 983 గ్రామాలకు 481 గ్రామాల్లో రీ సర్వే పూర్తి
- రైతుల చేతికి భూ హక్కు పత్రాలు
- వివాదాలకు తెర
- రైతుల సమక్షంలోనే సరిహద్దు రాళ్ల ఏర్పాటు
- బృహత్తర కార్యక్రమంపై ఎన్నికల వేళ దుష్ప్రచారానికి దిగిన చంద్రబాబు అండ్ కో..
- ఛీ కొడుతున్న జనం

విజయనగరం అర్బన్/రాజాం/మెరకముడిదాం/గుర్ల:

సార్వత్రిక ఎన్నికల ప్రచారం జోరందుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఫ్యాన్ గాలి స్పీడుగా వీస్తోంది. కూటమితో ముందుకొచ్చిన చంద్రబాబు ఏ హామీ ఇచ్చినా ఓటర్లు నమ్మడం లేదు. ఢిల్లీ నుంచి గల్లీ వరకూ 'కోటు'బాబులతో పాటు కమెడియన్ ఆర్టిస్టులను రంగంలోకి దించినా జనాల్లో స్పందన కనిపించడం లేదు. టీవీ యాక్టర్లను చూసేందుకు కూడా టీడీపీ, కూటమి సభలకు జనాలు రావడం లేదు. దీంతో ఏమి చేయాలో తోచక టీడీపీ అధినేత చంద్రబాబు అండ్ కో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై లేనిపోని ఆరోపణలకు దిగారు. భూ యజమానులకు మేలుచేసేలా.. వివాదాలకు తెరదించేలా.. మూడేళ్లుగా ఓ యజ్ఞంలా చేపట్టిన 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్షణ సర్వే'ను తప్పుదోవ పట్టించే యత్నానికి దిగారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్ అంశాలను ప్రజలకు తప్పుగా చూపించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో 983 గ్రామాలకు 481 గ్రామాల్లో రీ సర్వే పూర్తికావడం, రైతుల చేతికి హక్కు పత్రాలు అందడం, భూ వివాదాలు కళ్లముందే పరిష్కారం కావడం, కోర్టుల చుట్టూ తిరగాల్సిన పనితప్పడంతో టీడీపీ అబద్ధాలను ప్రజలు, మేధావులు నమ్మడంలేదు. ఎన్నికల వేళ చట్టం గుర్తొచ్చిందా అంటూ విమర్శిస్తున్నారు. రాజకీయ లబ్ధికోసం ప్రజోపయోగ కార్యక్రమాన్ని తప్పుదోవ పట్టించడంపై మండిపడుతున్నారు. ప్రభుత్వం చేసిన మేలు కనిపించాలంటే పొలాల్లోకి వచ్చి సరిహద్దురాళ్లను చూస్తే తెలుస్తుందని చంద్రబాబుకు హితవుపలుకుతున్నారు.

మూడు విడతల్లో రీసర్వే పూర్తయిన గ్రామాలు డివిజన్ వారీగా....

డివిజన్	గ్రామాలు	మొదటి	రెండో	మూడో	పూర్తినవి
విజయనగరం	389	29	117	48	191
చీపురుపల్లి	321	51	40	46	137
బొబ్బిలి	273	99	44	17	153
మొత్తం	983	179	198	111	481

వందేళ్ల తర్వాత సర్వే



బ్రిటిష్ కాలంలో భూ సర్వే చేపట్టారు. అప్పటి నుంచి ఏ ప్రభుత్వం భూ సర్వేపై దృష్టి సారించి రైతుల భూ సమస్యల పరిష్కారించడానికి మొగ్గు చూపలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొన్ని వేల కోట్లు ఖర్చుచేసి భూ రీసర్వేను చిత్తశుద్ధితో నిర్వహిస్తోంది. భూముల రీసర్వే వల్ల ఏన్నో ఏళ్ల నుంచి ఉన్న మా భూ సమస్యలు పరిష్కారమయ్యాయి. శాశ్వత హక్కు పత్రాలు చేతికందాయి.

– నడుపూరు అప్పలనాయుడు, రైతు, ఆనందపురం

ఎంతో మందికి ప్రయోజనం



భూములు రీ సర్వేతో చాలా గ్రామాల్లో భూ సమస్యలు గట్టెక్కాయి. కొత్తగా భూ యజమానులు హక్కు పత్రాలు పొందారు. ఈ హక్కు పత్రాలుతో రుణాలు కూడా పొందుతున్నారు. ఇంత మంచి కార్యక్రమం చేస్తుంటే ప్రతిపక్షాలకు పనిపాటా లేకుండా ఓటర్లను మభ్యపెట్టే కార్యక్రమం చాలా దారుణంగా ఉంది.

– వాకముల్ల చిన్నంనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు, రాజాం.

పక్కా హక్కు పత్రాలు వచ్చాయి



మా గ్రామంలో భూ సర్వే జరిగింది. నా భూములకు సంబంధించి హక్కు పత్రాలు ఇచ్చారు. వ్యవసాయ భూములతో పాటు పంచాయతీలో నివాస భూములపై కూడా నాకు హక్కు పత్రాలు లభించడం ఆనందంగా ఉంది. చంద్రబాబు పెద్ద మోసకారి. అతని మాటలు ఎవరూ నమ్మరు.

– కోరాడ వెంకన్న, గొల్లపేట, రాజాం మండలం

చంద్రబాబు కుట్ర పన్నారు..



రైతులను మోసగించేందుకు చంద్రబాబు కుట్ర పన్నారు. గతంలో రుణమాఫీ ఇస్తామని చెప్పి ఇవ్వలేదు. డ్వాక్రా మహిళలకు మాఫీ అని చెప్పి చేయలేదు. ఇంటికో ఉద్యోగం అని హామీ ఇచ్చి వదిలేశారు. ఇప్పుడు ఈ ఆల్ ఫ్రీ బాబు మాటలు ఎవరూ నమ్మడం లేదు. రైతులను ఎలాగో మభ్యపెట్టాలని ల్యాండ్ టైటిల్ యాక్ట్‌కు సంబంధంలేని అవాస్తవాలు మాట్లాడి, తన అనుకూల మీడియాలో అబద్ధాలను అచ్చేయించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం చేస్తున్నారు. చంద్రబాబు ఎంత గొంతు చించుకున్నా రైతులు టీడీపీని, చంద్రబాబుని నమ్మే పరిస్థితి లేదు.

– మజ్జి హరనాథరావు, మొగిలివలస, రాజాం మండలం

భూ వివాదాలకు తెర



ల్యాండ్ టైటిల్ యాక్ట్ అంటే వాస్తవ హక్కు దారుడు అని అర్థం. వందేళ్ల కిందట ఎప్పుడో సర్వే జరిగింది. చాలా మందికి భూములు ఉన్నా సొంత హక్కు పత్రాలు లేవు. ఇప్పుడు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సర్వే జరిపి అసలైన హక్కుదారునికి పట్టాలు ఇస్తున్నారు. ఇదొక బృహత్తర కార్యక్రమం. భూ వివాదాలు పూర్తిగా సమసిపోతాయి. ఇవి జీర్ణించుకోలేక చంద్రబాబు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. వీటిని ప్రజలు ఎవరూ నమ్మరు.

– వంజరాపు నర్సింహులునాయుడు, విశ్రాంత తహసీల్దార్, బొమ్మినాయుడువలస, రాజాం మండలం

రైతులందరికీ సొంత హక్కు పత్రాలు



తాత తండ్రులు కాలం నుంచి మా భూములు వంశపారంపర్యంగా వస్తున్నాయి. మాన్యువల్ అడంగల్ పత్రాలే అధికంగా ఉన్నాయి. భూముల రీ సర్వే అనంతరం పక్కా హక్కు పత్రాలు వస్తున్నాయి. జిల్లాలోని రైతులు అందరికీ ఇదెంతో ఉపయోగకరం. తమ పేరుమీద భూ హక్కు పత్రాలు లేక చాలా మంది ఇబ్బందులు పడ్డారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రీ సర్వేచేసి ఎవరి భూములు వారికి అప్పగిస్తుంటే టీడీపీ ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉంది.

– గేదెల వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు, ఉణుకూరు, రేగిడి మండలం

రీ సర్వేతో మంచే జరిగింది



ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన భూముల రీసర్వేతో మాకు మంచే జరిగింది. గ్రామంలో చాలా మంది రైతులకు చెందిన భూములకు రికార్డు లేక చెల్లుబాటయ్యేవి కాదు. ఇప్పుడు రీ సర్వేతో మా భూములకు విలువ వచ్చింది. మా భూములపై బ్యాంకులో లోన్లు కూడా ఇస్తున్నారు.

– వలిరెడ్డి రామారావు, బద్నాయినివలస, మెరకముడిదాం మండలం

మా భూములకు విలువ



మా భూములకు గతంలో విలువలేదు. ప్రభుత్వం తలపెట్టిన భూముల రీసర్వేతో మా భూములకు హక్కులు వచ్చాయి. చేతిలోనే పాస్‌బుక్కు ఉంది. రెవెన్యూ రికార్డుల్లో మా పేర్లు కూడా నమోదయ్యాయి. దీనిపై దుష్ప్రచారం చేయడం తగదు. రైతులకు మేలు జరిగితే చంద్రబాబు చూడలేడు. అప్పుడు వ్యవసాయం దండగన్నాడు. ఇప్పుడు భూములు ఎవరో వచ్చి లాక్కుంటారని ప్రచారం చేస్తున్నాడు.

– వలిరెడ్డి సూరప్పలనాయుడు, బద్నాయినివలస, మెరకముడిదాం మండలం

పక్కా హద్దుల నిర్ణయం



భూముల రీసర్వేలో భాగంగా పొలాల గట్లపై పక్కాగా సరిహద్దురాళ్లు పాతారు. తగాదాలకు శాశ్వత పరిష్కారం చూపారు. ఈ క్రతువులో ఐఏఎస్‌ల నుంచి సర్వే సిబ్బంది వరకు నిమగ్నమయ్యారు. భూముల కొలతలు హెచ్చు తగ్గులను కూడా పరిష్కారం చూపించారు. ఇంతటి మంచి కార్యక్రమాన్ని ఎన్నికల వేళ కొందరు ఓట్లుకోసం అపోహలు సృష్టిస్తున్నారు. ఈ విషయం రైతులందరికీ తెలుసు.

– వాల్లే సత్యం, రైతు, గుర్ల

ప్రచార హోరు..

ఎన్నికల సమయం సమీపిస్తున్న వేళ ఎమ్మెల్యే అభ్యర్థులు ప్రచారంలో జోరు పెంచారు. ఊరూరా, వార్డువార్డులో పర్యటిస్తూ ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు. తాముచేసిన మంచిని వివరిస్తూ ఓటువేయాలని అభ్యర్థిస్తున్నారు.

ప్రచార పర్వం



లక్కవరపుకోట మండలం తలారి గ్రామంలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, డాక్టర్ మధు దంపతులకు అక్కడి ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. గజమాల వేసి అభిమానం పంచారు.



మెరకముడిదాం మండలం గర్భాంలో మంత్రి బొత్స సత్యనారాయణ బుధవారం పర్యటించారు. ఆయనకు స్థానిక మహిళలు హారతిచ్చి స్వాగతం పలికారు.



రేగిడి మండలం పోరాంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ బుధవారం ప్రచారం చేశారు. అక్కడి ప్రజలు ఫ్యాన్ గుర్తుకే మా ఓటు అంటూ ఎమ్మెల్యేతో కలిసి నినదించారు.



వైఎస్సార్‌సీపీ బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి శంబంగి వెంకట చిన అప్పలనాయుడు బాడంగి మండలం రావివలసలో ఎన్నికల ప్రచారం చేశారు. ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు.



విజయనగరం 18వ డివిజన్‌లోని హుకుంపేట వాసులు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామిపై పూలవర్షం కురిపించారు. ఫ్యాన్ గుర్తుకే ఓటేస్తామని మాటిచ్చారు.



పూసపాటిరేగ మండలం పతివాడ బర్రిపేటలో వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి బద్దు కొండ అప్పలనాయుడు ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి మరోసారి ఆశీర్వదించాలని అభ్యర్థించారు.



బొండపల్లి మండలం దేవుపల్లిలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఎన్నికల ప్రచారం చేపట్టారు. అక్కడి మహిళలు ఆయనకు హారతిచ్చి విజయతిలకం దిద్దారు. ఫ్యాన్ ప్రభంజనం ఖాయమని భరోసా ఇచ్చారు.

వాటీజ్ దిస్ 'బేబీ'?

- ప్రజలంటే భయమా? లేదంటే ద్వేషమా?
- ఇంటి సమీపంలో సభ పెడితే తనకు రక్షణ ఉండదా?
- బొబ్బిలి టీడీపీ అభ్యర్థి బేబీనాయన ముందస్తుగా బెంగ
- సీఎం జగన్ బొబ్బిలి రోడ్డుషోపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:


మిట్ట మధ్యాహ్నం... బొబ్బిలి మెయిన్‌రోడ్డు... వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మలివిడత ప్రచార సభ... వేలాది జనం పోటెత్తారు. బుధవారం ఈ ప్రభంజనాన్ని చూసినవారంతా ఆశ్చర్యపోయారు. కానీ ఒక్కరు మాత్రం ఉలిక్కిపడ్డారు. ఆయనే బొబ్బిలి టీడీపీ అభ్యర్థి ఆర్‌వీఎస్‌కేకే రంగారావు ఉరఫ్ బేబీనాయన! తమ పూర్వీకుల వీరప్రతాపం గురించి కోటకు వచ్చినవారందరికీ పూసగుచ్చినట్లు చెప్పే ఆయన... ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి సభ అంటే హడలిపోవడం విచిత్రంగా ఉందని బొబ్బిలి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. అంతకుముందు జరిగిన వైఎస్సార్‌సీపీ సభలకు పోటెత్తిన జనాన్ని చూసి ముందురోజు నుంచే 'రక్షణ' పేరుతో చెడగొట్టే కార్యక్రమానికి తెరలేపారు. బొబ్బిలి కోట సమీపంలో సభ పెడితే తమ కుటుంబానికి భద్రత ఉండదని, తమకు రక్షణ కల్పించాలంటూ తన న్యాయవాది ద్వారా ఎన్నికల కమిషన్‌కు, అధికారులకు ఫిర్యాదులు పంపించడం గమనార్హం. కానీ రోడ్డుషోకు హాజరైన ప్రజలు కానీ, వైఎస్సార్‌సీపీ శ్రేణులు కానీ ఆ కోట గేటు వైపు కూడా కన్నెత్తిచూడలేదు. ఇక తన ప్రసంగంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడా బేబీనాయన గురించి కానీ, మంత్రి పదవి కోసం సంతలో పశువులా అమ్ముడుపోయి వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి ఫిరాయించిన ఆయన సోదరుడు ఆర్‌వీఎస్‌కే రంగారావు (సుజయ్) గురించి కానీ ప్రస్తావన తీసుకురాలేదు. ఒకవైపు కూటమి నాయకులు తీవ్ర అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేస్తున్నా జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం తన ప్రత్యర్థి పార్టీకి చెందిన బొబ్బిలి రాజుల పట్ల హుందాగా వ్యవహరించడంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ఇప్పుడు ఎమ్మెల్యే కావాలని...

బొబ్బిలి పట్టణంలో దశాబ్దాల సమస్యగా ఉన్న మెయిన్ రోడ్డు విస్తరణనూ చేపట్టలేక బేబీనాయన మున్సిపల్ చైర్మన్‌గా ఉన్నప్పుడు, ఆయన సోదరుడు సుజయ్ టీడీపీలోకి వెళ్లి మంత్రిగా అధికారం వెలగబెట్టినప్పుడు చేతులెత్తేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.10 కోట్ల వ్యయంతో మెయిన్‌రోడ్డును విస్తరించారు. ఆ సోదరులు బొబ్బిలికి చేసిన మేలేమిటో ఒక్కటీ చెప్పలేరు.

ఏమిటీ నాయనా మీ గొప్ప...

అధికారం దక్కేవరకే బేబీనాయనకు ప్రజలతో పని. ఒకసారి పీఠం దక్కిందా ఆ తర్వాత అదే ప్రజలను కోట గుమ్మం కూడా ఎక్కనివ్వని చరిత్ర ఆయన సొంతం. చివరకు అధికారులైనా దర్బార్‌మహల్‌లో రోజంతా పడిగాపులు బొబ్బిలి ప్రజలకు అనుభవమే. తొలుత 2009లో బొబ్బిలి 29వ వార్డు కౌన్సిలర్‌గా బేబీ నాయన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది. అదీ కోటను ఆనుకొని ఉన్న వార్డు, ఆరొందలకు మించని ఓటర్లు అయినా సరే గెలుపుపై భయం పట్టుకుంది. అప్పట్లో పోటీ పడిన టీడీపీ అభ్యర్థిని నయానాభయానో ఒప్పించి తన ఏకగ్రీవ ఎన్నిక కోసం బరి నుంచి తప్పించారు. అలా బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ పీఠం దక్కించుకున్న ఆయన పదవీకాలం 2009–14లో ముచ్చటగా మూడుసార్లు మాత్రమే ఆ కుర్చీలో కూర్చున్నారు. కారణమేమిటో తెలుసా? మున్సిపల్ సాధారణ సమావేశాల్లో కౌన్సిలర్లు కొన్ని సమస్యలపై నిలదీస్తుండటంతో తీవ్ర అసహనం వ్యక్తం చేసేవారు. పదవీ అలంకారం కాదు ప్రజాసేవ కోసమనే విషయం తెలియని ఆయన ఇక ఆ తర్వాత ఎప్పుడూ కౌన్సిల్ హాలులోకి అడుగుపెట్టలేదు. వైస్ చైర్మన్ గునాన విజయలక్ష్మికి బాధ్యతలు అప్పగించేసి ప్రజలకు ముఖం చాటేశారు. అంతే కాదు మున్సిపల్ చైర్మన్ పదవిలోకి వచ్చినప్పుడు తనకోసం ప్రత్యేకంగా చేయించుకున్న కుర్చీని కూడా కోటకు తీసుకుపోయారు.



ఆ మెయిన్ రోడ్డుపైనే సభలన్నీ...

'సైకిల్ పోవాలి' అంటూ చంద్రబాబు నినాదం ఇచ్చిన 'ఇదేమి ఖర్మ' కార్యక్రమం కూడా బొబ్బిలి మెయిన్‌రోడ్డుపైనే 2022 డిసెంబర్ 23న బేబీనాయన సమక్షంలోనే జరిగింది. పట్టుమని రెండు వేల మంది కూడా ఆ కార్యక్రమానికి రాలేదు. ఆ తర్వాత అదే రోడ్డుపై గత ఏడాది నవంబరు 23న జరిగిన వైఎస్సార్‌సీపీ 'ప్రజా సంకల్పయాత్ర'కు జనం పోటెత్తారు. కళాభారతి నుంచి బొబ్బిలి కోట వరకూ జనసంద్రమైంది. జగన్‌మోహన్‌రెడ్డి కార్యక్రమాలకు అంతకుమించి జనం వస్తారనే అంచనాతో బేబీనాయనకు బెంగపట్టుకుంది. సభాస్థలి కోటకు సమీపంలో పెట్టడం ఇష్టం లేక తన కోట 'భద్రత' పేరుతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

క్లుప్తంగా

రైలు కింద పడి యువకుడి మృతి


రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని యువకుడి మృతదేహం

బొండపల్లి: మండలంలోని గరుడుబిల్లి - గొట్లాం గ్రామాల మధ్య రైల్వే ట్రాక్‌పై గురువారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొని మృతి చెందాడు. సంఘటనకు సంబంధించి విజయనగరం రైల్వే పోలీస్‌స్టేషన్ హెచ్.సి బి.కృష్ణారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రైల్వే ట్రాకు దాటుతుండగాగానీ, రైలు ప్రయాణం చేస్తూ ప్రమాదవశాత్తు జారిపడిగానీ గుర్తు తెలియని 30 సంవత్సరాల వయస్సు గల యువకుడు పట్టాల మధ్య మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి తమకు సమాచారం అందించగా ప్రమాద స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లేవని, మృతుని శరీరంపై నలుపు, ఎరుపు రంగు చారలు అడ్డుగీతలు షర్టుతో పాటు, సిమెంటు రంగు ప్యాంట్ ధరించి ఉన్నట్లు గుర్తించినట్టు తెలిపారు. మృతదేహాన్ని విజయనగరంలోని కేంద్ర సర్వజన ఆస్పత్రికి తరలించామని ఆచూకీ తెలిసిన వారు విజయనగరం రైల్వే ఎస్‌ఐ పి.రవివర్మ 94906 17089, హెచ్‌సీ కృష్ణారావు 94410 13330 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

పుష్కరాలకు వెళ్లి పురోహితుడు మృతి


విశ్వేశ్వర శర్మ (ఫైల్)

సీతంపేట: నర్మద నది పుష్కరాలకు వెళ్లి స్థానిక లక్ష్మీగణపతి ఆలయ అర్చకులు వేమకోటి విశ్వేశ్వరశర్మ (66) గుండెపోటుతో గురువారం అక్కడ మృతి చెందారు. ఇటీవల మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో నర్మద పుష్కరాలకు కుటుంబ సభ్యులతో ఆయన వెళ్లారు. నదీస్నాన అనంతరం తిరుగు ప్రయాణమౌతుండగా ఆకస్మికంగా గుండె పోటు రావడంతో మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విశ్వేశ్వర శర్మ ఆకస్మిక మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. శుక్రవారం అంత్యక్రియలు స్వగ్రామమైన సీతంపేటలో జరగనున్నాయి. ఆయన మృతి తీరని లోటని గ్రామస్తులు సంతాపం తెలిపారు.

మద్యం తరలిస్తున్న ముగ్గురి అరెస్టు


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను చూపుతున్న సీఐ శ్రీధర్

రాజాం సిటీ: మండలంలోని వివిధ గ్రామాలకు మద్యం అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశామని ఎస్‌ఈబీ సీఐ బి.శ్రీధర్ గురువారం తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో వీఆర్‌అగ్రహారం కూడలి వద్ద 30 మద్యం బాటిళ్లతో ఒక వ్యక్తిని, కంచరాం గ్రామ కూడలిలో 51 మద్యం బాటిళ్లతో మరో వ్యక్తిని, పట్టణ పరిధి వస్త్రపురి కాలనీ వద్ద 53 బాటిళ్లతో మరో వ్యక్తిని అరెస్టు చేశామని తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐలు చంద్రశేఖర్, శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కరపత్రాల్లేకుండా ఏం అవగాహన..?

- వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేసిన కమిషనర్ డాక్టర్ వెంకటేష్


జూమ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు, ఇతర అధికారులు

విజయనగరం ఫోర్ట్: వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన కరపత్రాలను తీసుకెళ్లని ముగ్గురు పీహెచ్‌సీ వైద్యాధికారులపై వైద్యారోగ్యశాఖ కమిషనర్ డాక్టర్ వెంకటేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం వైద్యారోగ్య శాఖ అధికారులతో ఆయన జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. వడదెబ్బ కరపత్రాలు తీసుకెళ్లకుండా ఏవిధంగా ప్రజలకు అవగాహన కల్పిస్తారని ప్రశ్నించారు. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు తీసుకెళ్లి ఓఆర్‌ఎస్ కార్నర్ వద్ద సిద్ధంగా ఉంచాలని తెలిపారు. హీట్ వేవ్ నివేదికను ఐహెచ్‌పీ పోర్టల్‌లో ప్రతిరోజూ అప్‌లోడ్ చేయాలని తెలిపారు. వడదెబ్బకు గురియ్యే వారిని గుర్తించి ఐహెచ్‌ఈపీ పోర్టల్‌లో వివరాలు పొందుపరచాలని సూచించారు. ప్రతి పీహెచ్‌సీ వద్ద అగ్నిమాపక పరికరాలు ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యాధికారులు వారానికి ఒకసారి సిబ్బందితో సమీక్ష నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ ఎస్. భాస్కరరావు, డీఐఓ అచ్యుతకుమారి, డీఎల్‌ఓ కె. రాణి, డీఎంఓ మణి, తదితరులు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹143	₹253	₹263

వైద్య రంగంలో... ఉద్యోగ విప్లవం


ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి లేబొరేటరీ వద్ద వైద్య పరీక్షల కోసం వచ్చిన రోగుల వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

- వేల మందికి ఉద్యోగాలిచ్చిన జగనన్న ప్రభుత్వం
- ఐదేళ్ల కాలంలో 2400 మందికి ఉద్యోగాలు
- అన్ని కేడర్ పోస్టులు భర్తీ చేసిన ప్రభుత్వం
- రోగులకు మెరుగైన వైద్య సేవలు

విజయనగరం ఫోర్ట్: రాష్ట్రంలోని వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులను జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చింది. వైద్య రంగ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అధిక సంఖ్యలో ఉద్యోగాలను భర్తీ చేసింది. ఆస్పత్రుల్లో ఖాళీలను భర్తీ చేయడంతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. నాడు - నేడు ద్వారా ప్రభుత్వ ఆస్పత్రులను కార్పొరేట్ కంటే ధీటుగా తీర్చిదిద్దింది. ఆస్పత్రుల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించింది. దీంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందడానికి రోగులు అధిక సంఖ్యలో వస్తున్నారు. ఆధునాతన 108 అంబులెన్సులు ద్వారా సకాలంలో రోగులను ఆస్పత్రికి చేర్చి ఎంతో మందికి పునర్జన్మ ప్రసాదిస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా రోగుల ఇళ్ల వద్దకే వైద్య సేవలు అందిస్తున్నారు. ఆస్పత్రిలో ప్రసవానంతరం తల్లీబిడ్డ ఇద్దరిని తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలద్వారా సురక్షితంగా ఇంటికి చేర్చుతున్నారు.

వేలాది మంది నియామకం

వైద్య శాఖలో జిల్లాలో వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించి వారి జీవితాల్లో సీఎం జగన్ మోహన్ రెడ్డి వెలుగులు నింపారు. 2019 నుంచి ఇప్పటి వరకు 2400 మందికి ఉద్యోగాలు కల్పించారు. దీనిని బట్టి ఎంత పెద్ద ఎత్తున నియామకాలు చేపట్టారో అర్థమవుతుంది. వార్డు బాయ్ దగ్గర నుంచి స్పెషలిస్టు డాక్టర్ వరకు అన్ని కేడర్ల పోస్టులను భర్తీ చేశారు.

పారదర్శకంగా పోస్టులు భర్తీ

వైద్య శాఖలో పారదర్శకంగా పోస్టులను భర్తీ చేసింది. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ఎంఎన్‌ఓ దగ్గర నుంచి డాక్టర్ వరకు నిబంధనల ప్రకారం మెరిట్ ఆధారంగా పోస్టులను భర్తీ చేశారు. వేలాది పోస్టులు భర్తీ చేసినప్పటికీ ఎక్కడ అవకతవకలకు లేకుండా చర్యలు తీసుకున్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు

వైఎస్సార్ విలేజ్ క్లినిక్, పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రి, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రుల్లో వైద్య సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించడంతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. అంతేకాకుండా సకాలంలో వైద్య సేవలు అందుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల్లో ప్రభుత్వం సీహెచ్‌ఓ (కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్)ను నియమించింది. వీరు గ్రామ స్థాయిలో అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్నారు. పీహెచ్‌సీల్లో ఇద్దరు వైద్యులను ప్రభుత్వం నియమించింది. వీరిలో ఒకరు పీహెచ్‌సీలో వైద్య సేవలు అందించగా మరొకరు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పాల్గొని గ్రామాలకు వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నారు.

2019 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో భర్తీ చేసిన పోస్టుల వివరాలు	
కేడర్	పోస్టుల సంఖ్య
స్పెషలిస్టు డాక్టర్	23
మెడికల్ ఆఫీసర్	49
ఏఎన్‌ఎం	591
స్టాఫ్‌నర్సులు	278
ల్యాబ్ టెక్నీషియన్స్	80
ఫార్మసిస్టు	72
ఇతర పోస్టులు	147
క్లాస్ ఫోర్	279
డేటాఎంట్రీ ఆపరేటర్స్	33
ఎంఎల్‌హెచ్‌పీలు	604
థియేటర్ అసిస్టెంట్స్	35
కౌన్సిలర్లు	04
బయోమెడికల్ ఇంజనీర్స్	5
108, 104 సిబ్బంది	200

జీరో వేకెన్సీ పాలసీతో ఖాళీలు లేకుండా భర్తీ

గతంలో వైద్య శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులు ఏళ్ల తరబడి భర్తీ చేసేవారు కాదు. రెండు, మూడు పీహెచ్‌సీలకు ఒక వైద్యుడు, ఒక ల్యాబ్ టెక్నీషియన్ సేవలు అందించేవారు. కానీ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతి పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులను, ముగ్గురు స్టాఫ్ నర్సులను నియమించారు. ప్రతి పీహెచ్‌సీకి ఒక ల్యాబ్ టెక్నీషియన్‌ను నియమించారు. జీరో వేకెన్సీ పాలసీ తీసుకొచ్చి పోస్టుల కొరత లేకుండా పోస్టులను భర్తీ చేస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ, వైద్య విధాన్ పరిషత్, ప్రభుత్వ వైద్య కళాశాలల్లో వేలాది పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది.


నడుం నొప్పితో వచ్చిన వ్యక్తికి చికిత్స చేస్తున్న ఫిజియోథెరపిస్టులు

పోస్టల్ బ్యాలెట్ల పరిశీలన


పోస్టల్ బ్యాలెట్ల ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: పోస్టల్ బ్యాలెట్ల పరిశీలన కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం జరిగింది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఈ కార్యక్రమాన్ని పరిశీలించారు. బ్యాలెట్ పేపర్లను, కవర్లను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమాన్ని వేగంగా పూర్తి చేసి, ఆయా ప్రాంతాలకు పోస్టల్ బ్యాలెట్లను త్వరగా పంపించాలని ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్లు నోడల్ ఆఫీసర్ సందీప్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ ఎ.కళ్యాణ చక్రవర్తి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సుధారాణి, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

రెండు పూరిళ్లు దగ్ధం


అగ్ని ప్రమాదంలో కాలిపోయిన పూరిళ్లు

గుర్ల: మండలంలోని చోడవరంలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో లావేటి అప్పారావు, లావేటి ఎరకయ్యకు చెందిన పూరిల్లు పూర్తిగా కాలిపోయాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవ్వరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సుమారుగా రెండు లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని రెవెన్యూ అధికారులు అంచనా వేశారు. అగ్ని మాపక సిబ్బంది మంటలు ఆదుపు చేశారు.

గంజాయితో ముగ్గురి అరెస్టు


స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపిస్తూ వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటరావు (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: స్థానిక తోటపాలెం బ్యాంక్ కాలనీ సమీపంలో ఢిల్లీ నోయిడా ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి 18 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు పంపినట్లుగా వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం నోయిడా ప్రాంతానికి చెందిన షేర్, గౌరవ్ రజోనియా అనే ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి 18 కిలోల గంజాయితో రైల్వేస్టేషన్ వైపు వెళ్తుండగా వన్‌టౌన్ పోలీసులకు రాబడిన సమాచారంతో వారిని అదుపులోకి తీసుకుని, అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నామని, ఏదైనా సమాచారం ఉంటే వన్‌టౌన్ పోలీసులకు తెలియజేయాలని సీఐ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

15.6 కిలోల గంజాయి పట్టివేత

విజయనగరం రైల్వేస్టేషన్ పరిధిలో అరకు నుంచి విశాఖపట్టణం కిరండోల్ ఎక్స్‌ప్రెస్‌లో గురువారం నిర్వహించిన తనిఖీల్లో 15.6 కిలోల గంజాయిని రైల్వే లైన్స్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరావు నేతృత్వంలో విజయనగరం జీఆర్‌పీ ఎస్‌ఐ రవివర్మ, సిబ్బంది పట్టుకుని, సీజ్ చేశారు. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అశోక్ అనే వ్యక్తి రైల్‌లో గంజాయి రవాణా చేస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించారు. అతని నుంచి రూ.78వేలు విలువ గల 15.6 కిలోల గంజాయిని సీజ్ చేసి, నిందితున్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి, కొత్తవలస, అరకు రైల్వేస్టేషన్‌ల పరిధిలో తనిఖీలు విస్తృతం చేస్తున్నామని జీఆర్‌పీ లైన్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు తెలిపారు.

గంజాయి కేసులో ముద్దాయిలకు జైలు

విజయనగరం క్రైమ్: స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో 2020లో నమోదైన గంజాయి కేసులో ముద్దాయి చందక రమణకు మూడేళ్ల జైలు, రూ.30వేలు జరీమానా విధిస్తూ ఫస్ట్ క్లాస్ అదనపు జిల్లా జడ్జి జి.రజని తీర్పు వెల్లడించినట్లు టూటౌన్ సీఐ కె.రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బాబామెట్ట డబుల్ కాలనీలో గల రేకుల షెడ్ వద్ద 2020లో ఒక వ్యక్తి అక్రమంగా గంజాయి కలిగిన చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో అమ్ముతున్నట్లు టూటౌన్ పోలీసులకు వచ్చిన సమాచారంతో పోలీసులు బాబామెట్ట వద్దకు చేరుకుని నిందితుడు చందక రమణను అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి కేజీన్నర గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితులపై అప్పటి టూటౌన్ ఎస్‌ఐ వి.బాలాజీరావు కేసు నమోదు చేశారు. సీఐ సిహెచ్.శ్రీనివాసరావు దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్టు చేసి, కోర్టులో అభియోగపత్రాలను దాఖలు చేశారన్నారు. కోర్టు ప్రాసిక్యూషన్‌లో నిందితుడుపై నేరారోపణలు రుజువు కావడంతో విజయనగరం ఫస్ట్ క్లాస్ అదనపు జిల్లా జడ్జి జి.రజని మూడేళ్ల జైలు శిక్ష, రూ. 30వేలు జరీమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లుగా సీఐ కె తెలిపారు. కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బెల్లాన రవి, పోలీసుల తరఫున వాదనలు వినిపించగా, టూటౌన్ కోర్టు మహిళా కానిస్టేబుల్ రాధిక సాక్ష్యులను కోర్టులో హాజరుపర్చారన్నారు.

రోడ్డు ప్రమాదంలో బీజేపీ నేత దుర్మరణం


అల్లూరి రామకృష్ణ రాజు (ఫైల్)

గుర్ల: మండలంలోని కలవచర్ల వద్ద బుధవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బీజేపీ మాజీ మండల పార్టీ అధ్యక్షుడు అల్లూరి రామకృష్ణ రాజు (56) తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వ్యక్తిని 108 ద్వారా విజయనగరంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతున్న ఆయన గురువారం మృతి చెందారు. ఎస్‌ఐ భాస్కరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కలవచర్ల వద్దనున్న మలుపు వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తున్న అల్లూరి రామకృష్ణ రాజు, కోట గండ్రేడు నుంచి వస్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి రోడ్డు ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ఆయన మృతి వైఎస్సార్‌సీపీ నాయకులు, బీజేపీ నేతలు సంతాపం వ్యక్తం చేశారు.

నేటి నుంచి రిఫరీ, రిఫ్రెషర్స్ సెమినార్

విజయనగరం: న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరం జిల్లా కేంద్రంలో రెండు రోజుల పాటు నేషనల్ తైక్వాండో రిఫరీ, రిఫ్రెషర్స్ సెమినార్ శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్టు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సిహెచ్.వేణుగోపాలరావు గురువారం తెలిపారు. నగరంలోని రాజీవ్ క్రీడా మైదానం ప్రాంగణంలో జరిగే సెమినార్‌లో వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొనున్నట్లు పేర్కొన్నారు.

ఫ్యాన్ గాలికి ఫిదా...


కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బడ్డు కొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ సురేష్‌బాబు

- టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి..
- పార్టీలో చేరిన టీడీపీ పట్టణ అధ్యక్షురాలు లీలావతి

నెల్లిమర్ల: నెల్లిమర్ల పట్టణానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. నగర పంచాయతీ టీడీపీ అధ్యక్షురాలు బైరెడ్డి లీలావతి, మాజీ సర్పంచ్ బైరెడ్డి నాగేశ్వరరావు తమ అనుచరులతో కలిసి పార్టీలో చేరారు. లీలావతి, నాగేశ్వరరావు తదితరులకు నెల్లిమర్ల ఎమ్మెల్యే బడుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. త్వరలో జరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయా లని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కోరారు. నాగేశ్వరరావు, లీలావతి మాట్లాడుతూ టీడీపీలో తమకు గౌరవం తగ్గిందన్నారు. గౌరవం లేని చోట ఇమడలేమని చెప్పారు. జరజాపుపేటలో బోలె సన్యాసప్పడు, 50 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకులు నెక్కల నాయుడుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, ఏఎంసీ చైర్ పర్సన్ చిక్కాల అరుణకుమారి, పార్టీ నగర పంచాయతీ, మండల అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు, చనమల్లు వెంకటరమణ, జిల్లా కార్యదర్శి గంటా సతీష్, నగర పంచాయతీ వైస్ ఛైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కష్టారావు, వైస్ ఎంపీపీ పతి వాడ సత్యనారాయణ, కౌన్సిలర్లు చిక్కాల సంతోష్ కుమార్, చిక్కాల సుమతి, మైపాడ ప్రసాద్, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు రేగాన శ్రీనివాసరావు, నౌపడ శ్రీనివాసరావు, జానా ప్రసాద్, మద్దిల వాసు, జేసీఎస్ కన్వీనర్ మజ్జి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్లు ఇవే...


జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: పోస్టల్ బ్యాలెట్ కోసం ఒక్కో నియోజనవర్గానికి ఒక్కో ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశాలు జారీ చేశారు. విధుల్లో పాల్గొనే ఉద్యోగులు ఆయా కేంద్రాల్లో మే 5 నుంచి 8వ తేదీ వరకు ఎన్నికల్లో (ఫామ్-12) తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. అలాగే అత్యావసర సేవలకు సంబంధించి ఓటర్ల కోసం ఫెసిలిటేషన్ సెంటర్‌లోనే ప్రత్యేకంగా పోస్టల్ ఓటింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. వీరు ఈ నెల 5 నుంచి 7వ తేదీలలో ఉదయ 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్యలో వారి పోస్టల్ బ్యాలెట్లలో ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపారు.

ఫెసిలిటేషన్ సెంటర్ల వివరాలు	
నియోజనవర్గం	ఫెసిలిటేషన్ ఏర్పాటు చేసే కేంద్రం పేరు
రాజాం	ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా, రాజాం
బొబ్బిలి	శ్రీవేణుగోల్ మున్సిపల్ ఉన్నత పాఠశాల గొల్లపల్లి, బొబ్బిలి
చీపురుపల్లి	శ్రీరాం జూనియర్ కాలేజ్, ఎస్‌డీఎస్ కాలేజ ప్రాంగణంలో, గరివిడి
నెల్లిమర్ల	సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల, మిమ్స్ ఆస్పత్రి పక్కన, నెల్లిమర్ల
విజయనగరం	జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) ఇంజనీరింగ్ కళాశాల
ఎస్.కోట	ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ఎస్.కోట

సిజేరియన్లు అధికంగా చేస్తే చర్యలు : డీఎంహెచ్‌ఓ

విజయనగరం ఫోర్ట్: సిజేరియన్లు అధికంగా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు హెచ్చరించారు. సిజేరియన్లపై ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రత్యేక ఆడిట్ నిర్వహించనున్నట్టు చెప్పారు. మే నెలలో ఎండలు ఎక్కువగా ఉన్నందున విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల వద్ద మాక్ డ్రిల్ నిర్వహించాలన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగకుండా ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలన్నారు.

టీడీపీ విందు రాజకీయాలు

- ఓటర్లను ఆకట్టుకునేందుకు విందు ఏర్పాటు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న ఎంసీసీ టీం


విందు భోజనాలలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు


భోజనాలు చేస్తున్న టీడీపీ అభ్యర్థి కొండపల్లి, మాజీ జెడ్పీటీసీ శ్రీధర్

గజపతినగరం రూరల్: తెలుగు దేశం పార్టీ నాయకులు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా విందు భోజనాలకు దారులు తెరిచారు. గ్రామాల్లో ఎన్నికల ప్రచారం అనంతరం ఎటువంటి అనుమతులు లేకుండా అధికారులు కళ్లుగప్పి విందులు ఏర్పాటు చేస్తున్నారు. గురువారం మండలంలోని గంగచోళ్లపెంట గ్రామంలో ఉన్న ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో ప్రచారం అనంతరం కక్క, ముక్కా భోజనాలను టీడీపీ నాయకులు ఏర్పాటు చేశారు. ఈ విందులకు ఆయా గ్రామాల నుండి పలువురు పార్టీ అభిమానులతో పాటు నాయకులు పాల్గొని నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. ఎవరైనా అడిగితే ఫంక్షన్ హాలు వార్షికోత్సవం అని అందుకే భోజనాలను ఏర్పాటు చేశామని దీనికి అనుకోకుండా కొంతమంది టీడీపీ నాయకులు కండువాలతో రావడం జరిగిందని చెప్పుకొస్తున్నారు. ఈ విషయమై ఎంసీసీ(మోడల్ కోడ్‌ఆఫ్ కాండాక్ట్) ఎంపీడీఓ జయంత్ ప్రసాద్ వద్ద సాక్షి ప్రస్తావించగా టీడీపీ నాయకులు విందులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎటువంటి సమాచారం లేదని తెలిపారు. సమాచారం అందుకున్న ఆయన ఆ ప్రాంతానికి వెళ్లి చూడగా అప్పటికే భోజనాలు పూర్తయి అంతా వెళ్లిపోయారు. సదరు ఫంక్షన్ హాలు యజమాని మాత్రం వార్షికోత్సవం సందర్భంగా భోజనాలను ఏర్పాటు చేయడం జరిగిందని, టీడీపీలోని కొందరు కండువాలతో వచ్చారని తెలిపారన్నారు. దీనిపై ఆర్వో దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందని తెలిపారు.